పీహెచ్‌సీ లేక రోగుల ఇబ్బందులు

- గన్నేరువరం మండల కేంద్రంగా ఏర్పడి ఆరేళ్లు
- ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లేక ప్రైవేట్ ఆస్పత్రులకు పరుగులు



జంగపల్లి ఆరోగ్య ఉపకేంద్రం

గన్నేరువరం : పరిపాలనా సౌలభ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం నూతన జిల్లాలు, మండలాలను ఏర్పాటు చేసింది. అందులో భాగంగా 2016 అక్టోబర్‌లో గన్నేరువరం గ్రామాన్ని 13 గ్రామ పంచాయతీలతో కలిసి మండలకేంద్రంగా ఏర్పాటు చేశారు. అనంతరం సాంబయ్యపల్లె, చాకలివానిపల్లె, యాస్వాడ మూడు గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేసింది. అందుబాటులో మండలకేంద్రం ఏర్పాటు కావడంతో సదుపాయాలు కలుగుతాయని, సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేదని మండల ప్రజలంతా భావించారు. కానీ గన్నేరువరం మండలకేంద్రంగా ఏర్పడి ఆరేళ్లు గడిచినా నేటికీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలు ప్రభుత్వ వైద్యానికి నోచుకోవడం లేదు. ఉచితంగా వైద్యం చేయించుకోవాలంటే తిమ్మాపూర్ మండలంలో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లేదా సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలంలోని తోటపల్లి పీహెచ్‌సీ కేంద్రానికి వెళ్లాల్సిన దుస్థితి నెలకొందని మండల ప్రజల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఇతర జిల్లా కావడంతో వైద్యసేవలు అందడం లేదని, కరోనా సమయంలో ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు పలువురు వాపోతున్నారు. మండలంలో ఎక్కువశాతం మధ్య తరగతి ప్రజల కుటుంబాలే ఉన్నాయి. రోగాలబారిన పడితే వైద్యం కోసం 30 కిలోమీటర్ల దూరం వెళ్లాల్సిన పరిస్థితి.

జ్వరం వస్తే ఆర్‌ఎంపీలే దిక్కు

మండలంలో 23 వేల జనాభా ఉండగా గన్నేరువరం, ఖాసీంపేట, జంగపల్లి, గునుకుల కొండాపూర్ గ్రామాల్లో ఆరోగ్య ఉపకేంద్రాలు ఉన్నాయి. ఇందులో దగ్గు, జ్వరానికి మాత్రమే మందులు అందుబాటులో ఉంటాయి. ప్రధాన ఆరోగ్య కేంద్రం లేకపోవడంతో జ్వరాలు, వాంతులు, విరేచనాలు, పాముకాటు, తేలు, కోతులు దాడులు చేస్తే చికిత్స కోసం ప్రైవేట్ ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. ఏదైనా గాయాలు, జ్వరం తీవ్రంగా వస్తే గ్రామాల్లోని ఆర్‌ఎంపీలకు వద్దకు వెళ్లి చికిత్స చేయించుకోవాలి. నిరుపేద కుటుంబానికి చెందినవారు రోగాలబారిన పడితే ప్రైవేట్ ఆస్పత్రుల డాక్టర్లు, ఆర్‌ఎంపీలకు డబ్బులు వెచ్చించాల్సి వస్తోందని ప్రజల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్లిష్ట సమయంలో వైద్య పరీక్షల కోసం ప్రజలు జిల్లా కేంద్రానికి పరుగెడుతున్నారు.

స్థలం కోసం సర్వేచేసినా...

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటుకు ఐదేళ్ల క్రితం గన్నేరువరంతో పాటు జంగపల్లి, గుండ్లపల్లి గ్రామాల్లో ప్రభుత్వ స్థలాలను జిల్లా వైద్య అధికారుల బృందం, మండల రెవెన్యూ అధికారులు కలిసి గుర్తించారు. ఇందులో జంగపల్లి లేదా గుండ్లపల్లి అనువుగా ఉంటుందని భావించగా, గన్నేరువరంలో నిర్మించాలని కొందరు నాయకులు పట్టుబట్టినట్లు తెలుస్తోంది. కానీ చివరకు పట్టించుకోకపోవడంతో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఏర్పాటు కలగానే మిగిలిపోతుంది.

జ్వరమొస్తే ప్రైవేట్ హాస్పిటల్‌కే



మండలంగా ఏర్పడి ఆరేళ్లు కావస్తున్నా ఇప్పటివరకు గన్నేరువరంలో ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఏర్పాటు చేయలేదు. విష జ్వరాలు వస్తే ప్రైవేట్ ఆస్పత్రుల్లో చేరాల్సిన దుస్థితి. కష్టపడి సంపాదించిన డబ్బులు మొత్తం వైద్యానికే ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రజలకు అందుబాటులో ఏర్పాటు చేస్తే ఇబ్బందులు తప్పుతాయి.

– బామండ్ల రవీందర్, చీమలకుంటపల్లి

క్లుప్తంగా

బ్రిడ్జి నిర్మాణానికి నిధులు విడుదల చేయాలి



ఆందోళన చేస్తున్న ఉదయ్, మండలవాసులు

గన్నేరువరం: మండలంలోని మైలారం గ్రామం మైసమ్మ గుట్ట నుంచి కరీంనగర్ వరకు బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని బ్రిడ్జి జేఏసీ చైర్మన్ సంపత్ ఉదయ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల సరిహద్దులోని ఎల్‌ఎండీ వద్ద మండల వాసులతో కలిసి ఆందోళన చేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఎంపీ బండి సంజయ్‌కుమార్, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోకుండా బ్రిడ్జి నిర్మాణంపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎల్‌ఎండీ నిర్మాణం సమయంలో బ్రిడ్జి నిర్మాణానికి హామీ ఇవ్వడంతో నిర్మాణానికి రైతులందరు భూములు ఇచ్చారని, ఆనాటి నుంచి దగా కొనసాగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. బ్రిడ్జి నిర్మిస్తే కరీంనగర్‌కు మండల వాసులు వెళ్లడానికి ఏడు కిలోమీటర్ల దూరం మాత్రమే ఉంటుందని, ఇప్పుడు నలభై కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తోందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి గంగుల కమలాకర్ బ్రిడ్జి నిర్మాణంపై అధికారులతో సర్వే చేయించి కిలోమీటరున్నర బ్రిడ్జి నిర్మాణం చేపట్టి మండల వాసుల చిరకాల వాంఛ నెరవేర్చాలని విన్నవించారు. కొన్ని నెలలుగా ఆందోళనలు చేపడుతున్న ప్రజాప్రతినిధులు స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు. కార్యక్రమంలో కుమ్మరి రమేశ్, నవ్వుండ్ల కొమురయ్య, సంపతి రాములు, సంపతి మహేందర్, సురేశ్, లక్ష్మణ్, బాలయ్య, కిట్టు, అజయ్, అన్వేశ్ పాల్గొన్నారు.

‘ఎమ్మెల్యేను విమర్శించొద్దు’



మాట్లాడుతున్న మంగారపు సాయిపటేల్

గన్నేరువరం: ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పేదల పెన్నిధి, తెలంగాణ చరిత్రలో నిలిచిపోయే వ్యక్తి అని బీఆర్‌ఎస్ యువజన విభాగం మండల ప్రధాన కార్యదర్శి మంగారపు సాయిపటేల్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో మాట్లాడారు. మండల అభివృద్ధికి రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినిపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్యే కృషి చేస్తున్నారని, ప్రతిపక్షాలు విమర్శించడం మానుకోవాలని హితవు పలికారు. జెడ్పీటీసీ మాడుగుల రవీందర్‌రెడ్డిపై సైతం స్థానిక ప్రతిపక్ష నాయకులు బురదజల్లే రాజకీయాలు మానుకోవాలన్నారు. త్వరలోనే గుండ్లపల్లి నుంచి మండలకేంద్ర వరకు డబుల్ పనులు ప్రారంభమవుతాయని, పీహెచ్‌సీ ఏర్పాటుకు కూడా ముహూర్తం కుదిరిందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం, ఎమ్మెల్యే పాలనపై ప్రజలు విశ్వాసంతో ఉన్నారని తెలిపారు. సమావేశంలో మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ మెరుగు రాముగౌడ్, బత్తిని రవీందర్, బుర్ర అచ్యుత్‌గౌడ్, తాటికొండ తిరుపతి, ముత్యం శ్రావణ్, కూన రాజు, చిర్ల అనిల్, కాడే వంశీ, బుర్ర పవన్, రాపోలు పవన్, కొండ అన్వేశ్ పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం



హుజూరాబాద్: పట్టణంలోని విశ్వప్రగతి విద్యాలయం 1994–95 విద్యా సంవత్సరం పదో తరగతి విద్యార్థులు ఆదివారం మధువన్ గార్డెన్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం విద్యా బుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాడ రాజిరెడి,గోపు శ్రీనివాసరెడ్డి, కేతిరి సంపత్ రెడ్డి, కృష్ణమూర్తి, శ్రీనివాస్, వెంకటరమణ, శ్రీలక్ష్మి, విజయ, సరిత పాల్గొన్నారు.

బియ్యం అందజేత

శంకరపట్నం: మండలంలోని కరీంపేట గ్రామంలో ఇటీవల మృతిచెందిన కాసారపు రాజమ్మ కుటుంబాన్ని ఆదివారం బీజేపీ మండల అధ్యక్షుడు అనిల్ పరామర్శించారు. అనంతరం 50 కేజీల బియ్యం అందించారు. వెంట నరేందర్, సాగర్, సారయ్య, భిక్షపతి ఉన్నారు.

వలస కార్మికుల దోపిడీని అరికట్టాలి

హుజూరాబాద్: వలస కార్మికుల దోపిడీని అరికట్టాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్ అన్నారు. ఆదివారం ప్రెస్ క్లబ్‌లో మాట్లాడుతూ.. హుజూరాబాద్ మండల కేంద్రంలోని రైస్, సీడ్ మిల్లుల్లో పనిచేస్తున్న హమాలీ, ఆపరేటర్ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వకుండా అంతర్రాష్ట్ర వలస కార్మికుల చట్టాన్ని యాజమాన్యాలు అమలు చేయడం లేదని అన్నారు. తక్కువ కూలీ ఇస్తున్నారని, దోపిడీని అడ్డుకునేందుకు సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహిస్తామని తెలిపారు. కనీస వసతులు, పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా వంటి సౌకర్యాలు కల్పించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నాయని అన్నారు. సమావేశంలో నాయకులు కుమారస్వామి, లింగయ్య పాల్గొన్నారు.

సత్యంగౌడ్‌కు జాతీయస్థాయి స్వర్ణ నంది పురస్కారం

హుజూరాబాద్: పట్టణానికి చెందిన కవి నాగుల సత్యంగౌడ్ సామాజిక, ఆధ్యాత్మిక సేవలకు జాతీయస్థాయి స్వర్ణ నంది పురస్కారానికి ఎంపికయ్యాడు తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని శ్రీ శాంతి కృష్ణ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడితో పాటు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ మధుసూదనాచారి హైదరాబాద్‌లోని బిర్లా సైన్స్ సెంటర్‌లో ఆదివారం సత్యంగౌడ్‌ను జ్ఞాపక, స్వర్ణ నంది పురస్కారంతో గౌరవించారు. కార్యక్రమంలో డాక్టర్లు వెంపటి శ్రావణి, రాధిక, మోహన్, శ్రీనివాస్, కవులు, రచయితలు, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రొసీడింగ్ పత్రాలు అందజేత



ప్రొసీడింగ్ పత్రాలు ఇస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్

రామడుగు: మండలంలోని గుండి, మోతె గ్రామాల్లో వివిధ కమ్యూనిటీ హాళ్లకు, ఇతర కుల సంఘాల భవనాలకు నిధులు మంజూరయ్యాయి. వీటికి సంబంధించిన ప్రొసీడింగ్ పత్రాలను ఆదివారం కుల సంఘాల ప్రతినిధులకు బూరుగుపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు కలిగేటి లక్ష్మణ్, మాజీ సర్పంచ్ చెంద్రారెడ్డి, బండారి ప్రవీణ్, మునీందర్, నరేశ్, బడుగు లింగయ్య, రవీందర్, గుండి ప్రవీణ్ పలువురు పాల్గొన్నారు.

మడిపల్లిలో మెగా వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ నేరేళ్ల దామోదర్

జమ్మికుంట : పుట్టిన ఊరిపై మమకారంతో తల్లిదండ్రులు నేరేళ్ల రాధమ్మ – రామస్వామి జ్ఞాపకార్థం మడిపల్లిలో గ్రామాన్ని దత్తత తీసుకొని ఉచిత వైద్య సేవలు అందించామని ఎన్ఆర్ఐ అమెరికా వైద్యుడు డాక్టర్ నేరేళ్ల దామోదర్ (ఎండీ) తెలిపారు. మండలంలోని మడిపల్లి గ్రామంలో అమెరికా వైద్యులు (అప్పి), ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) వైద్యుల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన రెండో విడత ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..భారత మూలాలకు చెందిన అమెరికా వైద్యుల సంఘం గ్రామీణ ఆరోగ్య సంరక్షణ కార్యక్రమంలో భాగంగా దేశంలో దత్తత పథకం ద్వారా 61 గ్రామాలను ఎంపిక చేశారు. అందులో భాగంగా మా స్వగ్రామమైన మడిపల్లి గ్రామాన్ని ఎంపిక చేసి, జనవరిలో మొదటి విడత ఉచిత వైద్య శిబిరం నిర్వహించామని, రెండో విడత వైద్య శిబిరాన్ని ఆదివారం కొనసాగించామన్నారు. గ్రామంలో 190 మందికి గుండె సంబంధిత, జనరల్ వ్యాధులు, పీడియాట్రిక్, మధుమేహం, ఆర్థోపెడిక్‌తోపాటు ఆరోగ్య సంరక్షణ వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచిత మందులు అందజేసినట్లు తెలిపారు. పేద ప్రజల కోసం ఉచిత వైద్య సేవలు కొనసాగిస్తామని, పుట్టిన ఊరు రుణం తీర్చుకుంటానన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఆర్థోపెడిక్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ విజయ్ భాస్కర్, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు రాంకిరణ్, హుజూరాబాద్, జమ్మికుంట ఐఎంఏ అధ్యక్షుడు సుధాకర్ (పీడియాట్రిక్), నిజామాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు సుమన్‌కుమార్ (ఐఎంఏ) స్టేట్ మెంబర్ ఖమ్మం డాక్టర్ బీఎస్‌రావు, డయాబెటిక్ స్పెషలిస్ట్ డాక్టర్ సాయిని వెంకటేశ్వర్లు, సర్పంచ్ మూగల పర్శరాములు, బీఆర్‌ఎస్ నాయకులు నేరేళ్ల శ్రీనివాస్ గౌడ్, పొనగంటి మల్లయ్య, ఐలోని సాంబశివ రెడ్డి, కౌశిక్ రెడ్డి యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు బండి నాగరాజు, ఏఎన్‌ఎంలు శ్రీముఖి, ఒల్లాల దామోదర్, ఆశ కార్యకర్తలు సునీత, రమ, గ్రామ పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



సర్టిఫికెట్స్ అందజేస్తున్న తహసీల్దార్ రాజ్‌కుమార్

రామడుగు: మహిళలు కష్టపడి ఆర్థికంగా ఎదగాలని తహసీల్దార్ రాజ్‌కుమార్ కోరారు. మండల కేంద్రంలో రైజింగ్ సన్ యూత్ క్లబ్, ఉమెన్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మహిళలకు రెండునెలల పాటు ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం శిక్షణ ముగింపు కార్యక్రమంలో సర్టిఫికెట్స్ అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పంజాల ప్రమీల, జాతీయ యువజన అవార్డు గ్రహీత కిరణ్‌కుమార్, మండల యువజన సంఘాల అధ్యక్షులు అశోక్, మాజీ సర్పంచ్ జగన్‌మోహన్‌గౌడ్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ మాధురి, గల్ఫ్ జేఏసీ జిల్లా ఇన్‌చార్జి చిలుముల రమేశ్, అనిల్, మహేశ్ పాల్గొన్నారు.

ఒంటిపూట బడులు నిర్వహించాలి

రామడుగు: ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఒంటిపూట పాఠశాలలను నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్న ప్రకటనలో కోరారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడం వల్ల విద్యార్థులు పాఠశాలకు రావడంలేదని దీంతో హాజరుశాతం తగ్గిపోతోందని అధికారులు ఒంటి పూట బడులు నడిపించేలా ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

గర్శకుర్తిని మండల కేంద్రంగా చేయాలి



నిరాహార దీక్ష చేస్తున్న గ్రామస్తులు

గంగాధర: మండలంలోని గర్శకుర్తి గ్రామాన్ని మండలంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ గర్శకుర్తి మండల సాధన కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష ఆదివారంతో 50వ రోజుకు చేరుకుంది. మండలంగా ప్రకటిస్తే చుట్టు పక్కల గ్రామాలకు పరిపాలనా పరంగా అనుకూలంగా ఉంటుందని గతంలో గ్రామస్తులు చాలా సార్లు అధికారులు, ప్రభుత్వానికి వినతిపత్రాలు అందజేశారు. సీఎం కేసీఆర్ కరీంనగర్ పార్లమెంటు సభ్యుడిగా పోటీ చేసినప్పుడు ఎన్నికల ప్రచారంలో గ్రామానికి వచ్చి గర్శకుర్తిని మండలంగా చేస్తానని హామీ ఇచ్చారని ఆ తరువాత ప్రతి అసెంబ్లీ ఎన్నికల్లో ప్రచారానికి వచ్చిన ఎమ్మెల్యే అభ్యర్థులు సైతం మండలంగా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని ఏళ్లు గడుస్తున్నా ఎన్నో మండలాలను ఏర్పాటు చేస్తున్నా గ్రామానికి అవకాశం రాక పోవడంతో విసిగిన గ్రామస్తులు ఏప్రిల్ 30 నుంచి రిలే నిరాహార దీక్ష చేస్తున్నారు. ఈసందర్భంగా సీపీఎం నాయకులు మిట్టపల్లి రాజమౌళి, పత్తిపాక సురేష్, గౌడ శ్రీనివాస్ శిబిరాన్ని సందర్శించి నిరాహార దీక్ష చేస్తున్న వారిని సన్మానించారు.

కాంగ్రెస్‌లోకి భారీగా చేరికలు..?

గన్నేరువరం: మండలంలోని ఐదుగురు సర్పంచులు, ఒక ఎంపీటీసీ, ఐదు నుంచి ఎనిమిది మంది ఉపసర్పంచులు కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకునేందుకు రంగ సిద్ధం చేసుకుంటున్నారనే పుకార్లు జోరుగా వినబడుతున్నాయి. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బొడ్డు సునీల్, సాంబయ్యపల్లె, చొక్కారావుపల్లె, మైలారం, గునుకులకొండాపూర్ సర్పంచులు చింతలపల్లి నర్సింహారెడ్డి, ముస్కు కరుణాకర్‌రెడ్డి, దుడ్డు రేణుక, లింగంపల్లి జ్యోతితో పాటు మరో మహిళా సర్పంచ్, అలాగే గన్నేరువరం ఎంపీటీసీ బొడ్డు పుష్పలత, ఖాసీంపేట ఉప సర్పంచ్ బద్ధం సంపత్‌రెడ్డితో పాటు వివిధ గ్రామాల ఉప సర్పంచులు, పలు పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలతో డీసీసీ అధ్యక్షుడు, మానకొండూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కవ్వంపల్లి సత్యనారాయణ, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ పార్టీ స్థానిక నాయకులతో కలిసి చేరికలపై పలు దఫాలుగా చర్చించినట్లు తెలుస్తోంది. ఇటీవల గన్నేరువరంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవ సమయంలోనే చేరికలుంటాయని గుసగుసలు వినిపించినా బ్రేక్ పడింది. మళ్లీ గత నాలుగు రోజులుగా చేరికలపై మండలంలో జోరుగా చర్చించుకుంటున్నారు. త్వరలోనే మండల కేంద్రంలో భారీ బహిరంగ సభ నిర్వహించి పార్టీలో చేర్చుకుంటారని సమాచారం. మానకొండూర్ నియోజకవర్గం నుంచి రెండు సార్లు ఎమ్మెల్యే పదవికి పోటీ చేసి ఓటమిపాలైన కవ్వంపల్లి సత్యనారాయణ మండలంపై ఆరునెలలుగా వివిధ కార్యక్రమాలతో పార్టీ పటిష్టంపై దృష్టి సారించినట్లు స్పష్టమవుతోంది. ఇదే క్రమంలో గత ఎన్నికల్లో బీజేపీ నుంచి జెడ్పీటీసీగా పోటీ చేసినా చొక్కారావుపల్లె ఉప సర్పంచ్ అల్లూరి శ్రీనాథ్‌రెడ్డితో పాటు అతని అనుచరులను ఎమ్మెల్యే సీతక్క సమక్షంలో పార్టీలో చేర్చుకున్నారు. సర్పంచులు, ఎంపీటీసీ, ఉప సర్పంచులను పార్టీలో చేర్చుకుని మరింత పట్టు సాధించే ఎత్తుగడతో ఉన్నట్లు తెలుస్తోంది.

దగా చేసేందుకు దశాబ్ది ఉత్సవాలు

జమ్మికుంట: బీఆర్‌ఎస్ పాలనలో ఏం అభివృద్ధి జరగలేదని, ప్రజాధనం దండుకొని దగా చేసేందుకు సీఎం కేసీఆర్ దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ పట్టణ మహిళా అధ్యక్షురాలు పూదరి రేణుక విమర్శించారు. ఆదివారం పట్టణంలో మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రుణమాఫీ, రెండు లక్షల ఉద్యోగాల భర్తీ, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల హామీలను నెరవేర్చలేదని ఉత్సవాలు జరుపుకునే ప్రజాప్రతినిధులకు చిత్తశుద్ధి ఉండాలన్నారు. పాలన గాలికి వదిలేసిన ప్రభుత్వం ఆదరణ కోల్పోతున్నందున ఉత్సవాల పేరుతో ప్రజాధనం వృథా చేస్తున్నారని ఆరోపించారు. రాబోయే రోజుల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకుల ఇళ్లు ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకురాళ్లు నాగరాణి, శర్మ,కవిత, శ్రీవిద్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు బాగు చేయాలని రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న బీఎస్పీ నాయకులు

మానకొండూర్: ధ్వంసమైన రోడ్డు బాగు చేయాలని బీఎస్పీ నాయకులు మానకొండూర్‌లోని తూర్పు దర్వాజ వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈసందర్భంగా బీఎస్పీ మానకొండూర్ నియోజవకవర్గ ఇన్‌చార్జి నిషాని రాంచంద్రం మాట్లాడారు. అభివృద్ధి చేస్తాడని నమ్మి ఓటేసి గెలిపిస్తే ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆటపాటలకే పరిమితమయ్యాడని మండిపడ్డారు. అభివృద్ధి చేయని ఎమ్మెల్యే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అక్రమ భూదందాలు, ఇసుక రవాణాలో వాటా ఉన్న ఆయనకు రానున్న ఎన్నికల్లో గుణపాఠం చెబుతారని అన్నారు. ఏం సాధించారని ఉత్సవాల పేరుతో ప్రజల సొమ్ము పార్టీ ప్రచారానికి వినియోగించడం సిగ్గుచేటని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో బీఎస్పీ గెలుపు ఖాయమన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కుమ్మరి సంపత్, సీనియర్ నాయకులు సిరిసిల్ల అంజయ్య, కనుకుంట్ల ఓదెలు, దాసరి కొంరయ్య, ఆరెల్లి రాజు, గన్నారం రమేష్, వాసాల భానుచందర్, కొమ్మగళ్ల సాయికష్ణ, రేణికుంట ఆంజనేయులు, పొట్టాల అభిలాశ్ పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



అల్పాహారం కార్యక్రమంలో బీజేపీ నాయకులు

రామడుగు: మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం మహాజన్ సంపర్క్ అభియాన్ నిర్వహించారు. నరేంద్ర మోదీ ప్రధాన మంత్రిగా తొమ్మిదేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా చొప్పదండి నియోజకవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తల సామూహిక అల్పాహార కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమల్ల ఆంజనేయులు కేంద్రం పేదల కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ మంత్రి సుద్దాల దేవయ్య, మాజీ ఎమ్మెల్యే బోడిగె శోభ, జిల్లా ఉపాధ్యక్షుడు ప్రభాకర్‌యాదవ్, కోశాధికారి వైద రామానుజం, చొప్పదండి నియోజకవర్గ కన్వీనర్ పెరుక శ్రావణ్, మండల శాఖ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి, నాయకులు రేకులపల్లి రవీందర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, కోల అశోక్, రవీందర్‌రెడ్డి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సామాజిక సేవల్లో భాగస్వాములు కావాలి



వెంకట్‌రెడ్డిని సన్మానిస్తున్న సభ్యులు

రామడుగు: ప్రతి ఒక్కరూ గ్రామీణ ప్రాంతాల్లో సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని జగిత్యాల జిల్లా ధర్మపురి ఎల్ఐసీ బ్రాంచ్ మేనేజర్ భీరెడ్డి ప్రేమ్‌సాగర్ రెడ్డి కోరారు. మండలంలోని వెదిర గ్రామంలో ఆదివారం శ్రీ వినాయక రెడ్డి సంఘం ఆధ్వర్యంలో సంఘం ఆవరణలో కేశోరాం సిమెంట్ కంపెనీలో ఉద్యోగం చేసి పదవి విరమణ పొందిన మేనేజర్ వంచ వెంకట్‌రెడ్డి, మండల స్థాయిలో ఉత్తమ అంగన్‌వాడీ టీచర్‌గా అవార్డు అందుకున్న వంచ భాగ్యరాణిని సంఘం సభ్యులు సన్మానించారు. ఈకార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగులు అందించిన సేవలను గుర్తించి వారికి సన్మానం చేయడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వంచ సుదర్శన్‌రెడ్డి, వెదిర గ్రామ రెడ్డి సంఘం అధ్యక్షుడు భూంరెడ్డి, ఆర్టీసీ రిటైర్డు ఉద్యోగి వంచ కిష్టారెడ్డి, సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రాజిరెడ్డి, సంతోష్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడు రాళ్లబండి శ్రీనివాస్‌రెడ్డి, గంగాధర ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఊరూరా మంచినీళ్ల పండుగ



హుజూరాబాద్‌లో వాటర్ ట్యాంకును సందర్శించిన మున్సిపల్ చైర్‌పర్సన్, పాలకవర్గం



రామడుగు: వెలిచాల గ్రామంలో మంచినీళ్ల పండుగ నిర్వహిస్తున్న గ్రామస్తులు

సాక్షి నెట్‌వర్క్: చొప్పదండి, హుజూరాబాద్, మానకొండూర్ నియోజకవర్గాల్లో ఆదివారం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంచినీళ్ల పండుగ నిర్వహించారు. గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించడంతో పాటు, మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ రక్షిత మంచినీరు సరఫరా చేస్తున్న విషయాన్ని వివరించే ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. భగీరథ తాగునీటి స్వచ్ఛతపై అధికారులు ఆయా గ్రామాల్లో ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. గ్రామ పంచాయతీ సిబ్బంది, పంపు ఆపరేటర్లను సన్మానించారు. జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు, పాలకవర్గం, అధికారులు మిషన్ భగీరథ ఫిల్టర్‌బెడ్స్, ట్రీట్మెంట్ ప్లాంట్లు, వాటర్ ట్యాంక్‌లను సందర్శించారు. తాగునీటికి ఆడబిడ్డలు గోస పడకూడదని సీఎం కేసీఆర్ మిషన్ భగీరథ పథకాన్ని అమలు చేశారని, ప్రభుత్వానికి అండగా ఉండాలని కోరారు. చొప్పదండి మండలంలోని గ్రామ పంచాయతీల్లో వాటర్ ట్యాంకుల వద్ద ముగ్గులు వేశారు. నీటిని సద్వినియోగం చేసుకున్న వారిని గుర్తించి జ్ఞాపికలతో సన్మానించారు. ప్రజల తాగునీటి అవసరాలను తీర్చడం కోసం సీఎం కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వం కోట్లాది రూపాయలు కేటాయించిందనిహుజూరాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక అన్నారు. నీటి సరఫరా విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులను పాలకవర్గం సభ్యులు సన్మానించారు.